# భయం... భయం...

రంగ్...

-బి.వి.ఎస్. బాబు

రంగ్...

రంగ్...

రంగ్...

రంగ్...

ఆఫీసులో గోడగడియారం సరిగ్గా లెక్కపెట్టి మరీ అయిదు గంటలు కొట్టింది.

బ్రహ్మానందం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఓమారు ఆ గోడగడియారం వంక కోపంగా చూశాడు.

అందులోని అయిదుగంటలు తనను వెక్కిరిస్తున్నట్లుగా అనిపించి విసురుగా తల తిప్పేసుకున్నాడు.

అది అతనికి కొత్తేమీకాదు.

తన టేబుల్‌మీదున్న ఫ్యాన్ గిర్రున తిరుగుతున్నా బ్రహ్మానందంకు ఒక్కసారిగా ముచ్చెమటలు పోసుకొచ్చేశాయి.



ఓమారు ప్యాంటు జేబులోనుండి కర్చీఫ్‌ను బయటకు తీసి ముఖం తుడుచుకుని ఆ తర్వాత ఆ కర్చీఫ్‌ని పిండి ఆ టేబుల్ ప్రక్కన చిన్నసైజు మడుగు లాంటిది చేశాడు.

తన ముందున్న ఫైల్సన్నీ గబగబా సర్దేసి కుర్చీని విసురుగా వెనక్కి ఒక్కనెట్టు నెట్టి దిగ్గున పైకిలేచి క్షణంలో ఆఫీసునుండి బయటపడ్డాడు.

అలా అసంకల్పిత ప్రతీకారచర్యలాగా నడుచు కుంటూ సరాసరి ఓ కాఫీ హోటల్‌కు వెళ్ళి ఓ కప్పు కాఫీ గటగటా తాగి అటు నుండి అటే ఓ పార్కుకు వెళ్ళి ఓ పొదచాటున చతికిలపడ్డాడు.

బ్రహ్మానందం అలా కూర్చోవడం ఆలస్యం అతడి ఆలోచనలు తాలూకు సుళ్ళు గిర్రుగిర్రున మొఖం మీద తిరగటం ప్రారంభించాయి.

ఆ ఆలోచనలకు మూలకారణం...?

అతని భార్య!

పాపం! భార్య గుర్తుకు వచ్చినప్పుడల్లా ఏ.కే. 47 రైఫిల్ చూసినట్లుగా బెదిరిపోతాడు.

తన భార్య గయ్యాళి తనానికి జడిసి పొరపాటున కాదు గదా, కనీసం కలలో కూడా ఎదురుచెప్పడానికి సాహసించడు.

బ్రహ్మానందం భార్య నోటిదురుసుతనం గురించి ఇరుగుపొరుగుకే కాదు ఆ జిల్లా మొత్తానికి తెలుసంటే అతిశయోక్తి కాదు.

అంతేకాదు!

తనను భార్యచాటు భర్తని, గయ్యాళిభార్య పిరికి భర్తని, లోకులు పలు రకాలుగా చాటుమాటున అను కోవడం, హరికథలుగా చెప్పుకోవడం తనకు తెలుసు.

అందుకనే...

ఆఫీసులో గోడ గడియారం అయిదు గంటలు కొట్టగానే ఇల్లు గుర్తుకు వస్తుంది. ఆ వెంటనే భార్య.

ఆ భార్య గుర్తుకు వచ్చినప్పుడల్లా తన నరనరాల్లోనూ ఐస్ కూర్చినట్లుగా గజ గజ వణికిపోతాడు.

ఆ అలారం మీదపగ. అందుకే ఆ అలారంలోని అయిదు గంటలు మీద కసిపెంచుకున్నాడు.

మొన్నటికి మొన్న...

తను పక్కింటి ఆవిడతో కలసి షాపింగ్‌కు వెళ్ళి రెండు చీరలు తెచ్చుకోవాలి ఆఫీసునుండి ఇంటికి త్వరగా తగలడండి అంది.

కానీ.

ఆరోజు తన ఖర్మ కాలింది.

ఆఫీసులో అదనపు పని తన మీద పడటంతో మొహమాటం కొద్దీ ఆ పని పూర్తిచేసి బయటపడే సరికి సరిగ్గా తొమ్మిది గంటలయ్యింది.

అంతే...

తను ఇంటికి వెళ్ళి వెళ్ళగానే తనమీద కూచిపూడి, కథాకళి లాంటి దేశవాళీ నృత్యాలన్నీ చేసి తను అప్పటివరకూ అణిచి పెట్టుకుని ఉన్న కోపాన్ని కొంతలో కొంత తీర్చుకుంది.

తనమీద వెళ్ళగక్కుతోన్న ఆ కోపాన్ని ఎంతో ఉత్సుక-తతో గుడ్లప్పగించి చూశారు ఇరుగుపొరుగు అమ్మలక్కలు, నాన్న చెక్కలు.

నిన్నటికి నిన్న...

తన పుట్టింటి తరుపు బంధువులొచ్చారంటూ వారికి లేని పోని మర్యాదలూ గట్రా ఒలకబోస్తూ తన విషయమే పట్టించుకోలేదు.

ఓ పక్క తనకు ఆఫీసు టైమ్ అవుతోంది. ఆఫీసరసలే నిప్పులు తొక్కిన ముసలి కోతి.

అదే తన భయం!

ఆ భయంలో తనకు ఓ చిలిపి ఆలోచన తళుక్కు మంది.

తనకు ఎటూ చుట్టుపక్కల పరువులేదు. కనీసం గుడ్డిలో మెల్ల అన్నట్టు ఆమె బంధువుల దగ్గిరన్నా 'తను భార్యకు చెప్పుచేతల్లో పెట్టుకున్న భర్త'గా అనిపించు కోవాలన్న ఉద్దేశంతో తన బంధువుల దగ్గిర మర్యాద కోసమన్నా తనకు ఎదురు చెప్పదన్న పేరాశతో తను ఎప్పుడూ చేసుకునే తన పనులను కూడా ఆమె చేత చేయించాడు.

ఆమె మౌనంగా తను చెప్పిన పనులన్నీ చేసుకుంటూ పోయేసరికి తనకు ఎక్కడలేని ధైర్యం వచ్చి గొంతు కొంచెం చించుకున్నాడు.

ఆమె మాట్లాడలేదు.

తను మరింత విజృంభించి ఆమె చెంపమీద ఓ చిన్న దెబ్బ వేశాడు.

అంతే...

అప్పటివరకు అణిగిమణిగి ఉన్న అగ్నిపర్వతం ఒక్కసారిగా బ్రద్దలయ్యింది.

ఫలితం!

ఆ బంధువుల దగ్గర తన పరువు గల్లంతయ్యింది.

ఉదయానికి ఉదయం...

తను భోజనం దగ్గర కూరలో కాస్త ఉప్పూ, కారం ఎక్కువయ్యాయనుకుంటా అన్నాడు.

అంతే...

ఒక్క క్షణం కూడా ఆలస్యం చేయకుండా తనమీద ఉప్పెనలా విరుచుకుపడింది.

ఆ ఉప్పెనలో తను తడిసి ముద్దయిపోవడం చుట్టుపక్కల వారికి ఆనంద భాష్పాలను రాల్చింది.

తన భార్య తనను రాచి రంపాన పెడుతోందనీ, తనను దద్దమ్మను చేసి ఆడిస్తోందని కాదు తన బాధల్లా... ఆ చేసేదేదో గుట్టుచప్పుడు కాకుండా చేస్తే తనపరువు కొంతలో కొంతయినా దక్కి ఉండేది గదాని.

ప్చ్!


తన పరువు తిరిగి తనకు దక్కాలంటే ఏం చెయ్యాలి? ఏదో ఒకటి చెయ్యాలి.

అదే! ఎలా...?

బ్రహ్మానందం ఆలోచిస్తున్నాడు.

తను కూడా మగాడుగా ఒక్క క్షణమన్నా బతకాలి. తను పెదవి కదిపితే తన భార్య ఒక్క క్షణమన్నా వణికిపోవాలి.

తను పేరుకు తగ్గట్టుగా బ్రహ్మానందంగా ఉండాలి.




ఎన్. సుధాకర్ రావు, చంద్రశేఖరపురం, రాచర్లపాడు (పోస్ట్), కొడవలూర్ (తా), నెల్లూరు జిల్లా.

అది చూసి ఇరుగుపొరుగు ఒక్క క్షణమన్నా విస్తుపోవాలి. అప్పుడు తను ఒక్క క్షణమన్నా గర్వంగా తల ఎత్తుకు తిరగాలి.

కానీ...

అది సాధ్యపడేదేనా...?

అది తన వల్ల అవుతుందా...?

ఆమెకు ఎదురు చెప్పడానికే భయపడే తను తనను చూసి ఆమె భయపడేలా చేయగలడా...?

తను. తన భార్యను అదుపులో పెట్టలేకపోయినా కనీసం చప్పగా అడుగంటిపోయిన తన పరువును తిరిగి ఆకాశమంత ఎత్తు నిలబెట్టాలి.

అదే తన కోరిక.

ఆఖరి కోరిక.

బ్రహ్మానందం ఆలోచిస్తున్నాడు.

ఒక్కో ఓణం గడుస్తోంది.

అంతే...

ఓ శుభముహూర్తాన బ్రహ్మానందం మెదడును తొలుస్తూ ఓ మంచి ప్లాన్ బయటికి దూసుకు వచ్చింది.

పట్టరాని ఆనందంతో ఓ మారు గుండె నిండుగా గాలి పీల్చుకుని గట్టిగా ఓ ఈల వేయబోయాడు. కానీ... ఏ శబ్దం బయటకు రాలేదు.

తన ప్లాన్ రానున్న ఆదివారం అమలుపరచడానికి నిర్ణయించుకున్నాడు.

ఎందుకంటే ఆ రోజు శెలవురోజు గాబట్టి ఇరుగు పొరుగు అంతా ఇంటి దగ్గరే చస్తారు గాబట్టి. అప్పుడే తన ప్లాన్ సక్సెస్ అవుతుంది.

బ్రహ్మానందం మరుక్షణం గాలిలోకి లేచి ఇంటికి వెళ్తున్నానన్న భయం కూడా లేకుండా ధైర్యంగా హుషారుగా అడుగులు ముందుకు వేయసాగాడు.

★ ★ ★

ఆదివారం.

సమయం నాలుగ్గంటలు.

బ్రహ్మానందం ఇంటిలో నుండి హఠాత్తుగా ఒకటే దెబ్బలు. దెబ్బలంటే దెబ్బలుకావు. అవి బెల్ట్ దెబ్బలు.

ఒక్క క్షణంలో ఇరుగుపొరుగంతా ఆ ఇంటి ముందు పోగయ్యారు. ఇంటి తలుపులు మూసి ఉండటంతో అందరూ బయటనే ఉండి ఒకరి మొఖాలు ఒకరు చూసుకోసాగారు.

ఒక్కసారిగా అందరిలోనూ బ్రహ్మానందం గురించి ఆలోచనలు చోటుచేసుకున్నాయి.

"ప్చ్!"

"పాపం!"

"అర్రెర్రె!"


"అయ్యయ్యో!"

ఒక్కొక్కరు పలురకాలుగా సానుభూతిని వ్యక్తం చేయటం ప్రారంభించారు.

కానీ...

ఆ అందరి అంచనాలకూ, ఆలోచనలకూ విరుద్ధంగా బ్రహ్మానందం ప్రళయ గర్జనలు భయంకరంగా వినిపించాయి.

"ఏమే... నీ కంటికి నేను మరీ అంత చులకనగా కనపడుతున్నానుటే... ఆడదానివి అందునా కట్టుకున్న భార్యవు చేయిచేసుకోవడం సంస్కారం కాదని ఉపేక్షిస్తూ వస్తూంటే కన్నూ మిన్నూ కానరాకుండా పోతావుటే... రాక్షస జాతిదానా..."




శ్రీ. శ్రీధర్, కొండాపురం .రాయదుర్గం. అనంతపురం(జిల్లా)

ఛెళ్ళు... ఛెళ్ళు...ఛెళ్ళు...

ఆ గొంతువిని జనమంతా బిత్తరపోయారు.

బ్రహ్మానందంను అతని భార్యకాకుండా బ్రహ్మానందమే భార్యను కొడుతున్నాడు.

ఎంత ధైర్యం!

ఎంత సాహసం!

ఎంత విడ్డూరం!

ఒక్కసారిగా గుంపంతా ముక్కున వేలేసుకుని గుసగుసలు ప్రారంభించారు.

"మీలో ఎవరన్నా ముందుకు వెళ్ళి ఆ తలుపులు తెరిపించండి. లేకపోతే అతగాడు ఇన్నాళ్ళూ అణిచిపెట్టుకుని ఉన్న కోపాన్నంతా వెళ్ళగక్కాడంటే ఆమె బతకదు. ఊ వెళ్ళండి!" అరిచాడు ఆ గుంపులో నుండి ఓ పెద్ద మనిషి.

"మాకు అంత ధైర్యం లేదు. అంతగా అయితే నువ్వే వెళ్ళు..." ఎవరో అరిచారు.

ఆ పెద్ద మనిషి మరి మాట్లాడలేదు.

ఆ గదిలో నుండి బెల్ట్ దెబ్బలు లయబద్ధంగా వినిపిస్తూనే ఉన్నాయి.

"నా దగ్గర టన్నుల కొద్దీ ఓర్పూ సహనం ఉన్నాయి గాబట్టి ఈరోజు వరకు నీ గయ్యాళితనాన్ని సహిస్తూ వచ్చాను.నువ్వు చేసిన ఎన్నో ఘోర తప్పిదాలను క్షమించాను. అదే మరొకడైతే నిన్ను ఏనాడో పెద్దల జాబితాలో కలిపేసి చేతులు దులుపుకునేవాడు దయ్యప్పీనుగా..."

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

"హన్నన్నా! నీకసలు చుట్టాలనీ లేదు. పక్కాలనీ లేదు. భర్తని అని కూడా చూడకుండా ఎంతమాట పడితే అంతమాట... నీ ఇష్టం వచ్చినట్లు పెట్రేగిపోతావుటే పిశాచం మొహమా!"

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

"నా అతి మంచితనం ఆసరాగా తీసుకుని అందరి దృష్టిలో నన్ను ఒక చవటగా... దద్దమ్మగా... పిరికి వాడిగా... వెధవగా చేస్తావుటే అప్రాచ్యపుదానా!"

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

"నీ ఎదురుగ్గా నిల్చుని తనివితీరా ఆవులించడానికి కూడా నాకు అవకాశం లేకుండా చేస్తావుటే... యాబ్రాసి మొహమా!"

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

"ఇహ ఈరోజుతో నీ గయ్యాళితనానికి సమాధి కట్టి నా మీసాలకు సంపెంగనూనె రాసి ఎగదువ్వుతానే... అప్పడం మొహమా!"

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

"ఇదిగో ఇప్పుడే చెబుతున్నా. మరోసారి నామాటకు ఎదురు చెప్పావో ఛమ్డాలు వలిచేస్తాను. జాగ్రత్త! ఏమను

కున్నావే... అయ్!"

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

ఛెళ్ళు... ఛెళ్ళు... ఛెళ్ళు...

ఓ రెండు నిముషాలు గడిచాయి. ఆ ఇంటి తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి.

బ్రహ్మానందం బయటికి వచ్చారు. అతడి కళ్ళు జీంజర్ లైట్లులా వెలిగిపోతున్నాయి.

జుట్టురేగి చీకేసిన తాటి కాయలా ఉంది.

వళ్ళంతా చెమటతో తడిసి అప్పుడే స్నానం చేసినట్టుగా ఉంది.

చేతిలో బెల్టు తాచుపాములా ఊగిపోతోంది.

ఆ విశ్వరూపాన్ని వింత జంతువును చూసినట్టుగా చూస్తోంది గుంపు.

బ్రహ్మానందం ఓ మారు తన ఇంటి ముందు బెల్లం చుట్టూ ఈగల్లా మూగిన జనం వైపు చూశాడు. ఆ జనం తనవంక వింతగా చూస్తూండటంతో గర్వంగా తన క్రాఫును ఓ ప్రక్కగా ఓ చేత్తో సరిచేసుకుంటూ ఓ చిరునవ్వును ఎవరికీ కనపడనీయకుండా తన పెదవులు మీదుగా పక్కకు దొర్లించాడు.

ఓ ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు బ్రహ్మానందం భార్యను ఓదార్చడానికి లోపలికి పరుగెత్తబోయారు. బ్రహ్మానందం వారిని మధ్యలోనే అడ్డుకున్నాడు.

"ఏడవనీయండి... బాగా ఏడవనీయండి. ఇన్నాళ్ళూ నన్ను ఏడిపించిందిగా. ఈ రోజునుండి దాన్ని ఏడవనీయండి. అదే దానికి తగిన శాస్తి." కోపంతో ఊగిపోతూ అన్నాడు బ్రహ్మానందం.

బ్రహ్మానందం కోపం చూసి ఆ ఆడవాళ్ళు వెనక్కు తగ్గారు. బ్రహ్మానందం తలుపులు దగ్గరకు లాగి బయట గొళ్ళెం పెట్టాడు.

ఇరుగుపొరుగంతా బ్రహ్మానందం వీరోచిత చర్యను గొప్పగా చెప్పుకుంటూ ముందుకు కదలబోతున్న సమయంలో ఓ ఆటో దూసుకువచ్చి ఆ ఇంటి ముందు ఆగింది.

బ్రహ్మానందంతో పాటు అక్కడి జనం ఆ ఆటోవైపుకు దృష్టి మళ్ళించారు.

ఒక్క క్షణం గడిచింది.

ఆ ఆటోలోనుండి దిగుతోన్న ఆమెను చూసి అక్కడి జనం అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

ఆమె...

బ్రహ్మానందం భార్య!

తన భార్యను చూసి ఒక్క క్షణం నిశ్చేష్టుడయ్యాడు బ్రహ్మానందం.

బ్రహ్మానందం చేసిన మాయాజాలం జనానికి న్యూస్ రీల్లా కంటికి కనిపించినట్లయ్యింది.

పాపం!

పుట్టింటికి వెళదామని బయలుదేరి వెళితే బస్టాండ్ లో కూర్చుని కూర్చుని విసుగుపుట్టిందే తప్ప ఒక్క బస్సూ రాలేదు. దాంతో ఆమె వెనక్కు తిరిగి వచ్చింది.

ఆమె ఆటో దిగి దిగగానే ఆమెకు జరిగిన తతంగమంతా పూసగుచ్చినట్లు వివరిస్తోంది ఓ అమ్మలక్క.

ఆమె ఆ అమ్మలక్క చెప్పిందంతా విని అఖండరుద్ర కాళిలా ఊయాలలో నిల్చుని ఊగిపోతున్నట్లుగా ఊగిపోతోంది.

ఆమె రౌద్రరూపాన్ని చూసి బ్రహ్మానందం గుండె ఆమడ దూరం పరిగెత్తుకు పోయింది. ఒక్కసారిగా వెన్నులోంచి చలి బయటకు దూసుకువచ్చింది.

ఆమె ముందుకు కదిలింది.

బ్రహ్మానందంకు ఆమె అలానడుస్తూ వస్తూంటే పులులూ... సింహాలూ... చిరుతలూ... ఎలుగుబంట్లూ... నక్కలూ... తోడేళ్ళులాంటి జంతు జాలమంతా ఒక్కసారిగా తనమీదపడి పీక్కుతినడానికి వస్తున్నట్లుగా ఉంది.

బ్రహ్మానందం పరిస్థితి ఇహ 'ఫినిష్' అనుకున్నారు జనం.

అక్కడ జరగబోయే పతాక సన్నివేశం ఎంత భయంకరంగా ఉంటుందో ఊహించుకుని ఒక్కరొక్కరే అక్కడ నుండి వేగంగా తప్పుకోవటం ప్రారంభించారు.

బ్రహ్మానందం ఒక్కక్షణం కూడా ఆలోచించడానికి భయపడ్డాడు.

అంతే...

ఒకే ఒక్క ఉదుటున కురుక్షేత్ర సంగ్రామంలో పద్మవ్యూహంలోకి చొచ్చుకుని పోయిన అభిమన్యుడిలా ఆ జనం మధ్యలోకి దూకి కంటికి కనిపించకుండా పోయాడు.



## నా దేశం...

ఆమె ఒక దేవత
రూపం, లావణ్యం,సౌజన్యం - అన్నీ ఆమె !
ఆమె చూపుల కనుసన్నలలో
ఏదో తెలియని మౌనం - గాంభీర్యం !
కవుల కలానికి చిక్కలేని వర్ణన ఆమెది
ఆమె పలకరింపులో వింత మాధుర్యపు తలపుల జల్లులు
ఆమె ఎవరో తెలుసా !
" నా దేశ మాతృమూర్తి!!"

బి.రాజమౌళి,
ఇం.నెం. 12 - 153/19
దేవి నర్సింగ్‌హోమ్ దగ్గర,
సిద్దిపేట (పోస్ట్): 502 103.


ఆ తర్వాత...

ఎన్నో రోజులూ... వారాలూ... నెలలూ... సంవత్సరాలూ... అలా అలా గడిచిపోయాయి.

కానీ...

బ్రహ్మానందం జాడ అంతు చిక్కలేదు!

బి.వి.ఎస్. బాబు.
డిఇఇ / ఆపరేషన్
ఎ.పి.ఎస్. ఇ.బి,
తెనాలి - 522 202.




ప్రతిమా భాస్కర్ భీమా, డి.ఎస్.ఎస్.ఎఫ్. సి. స్టోర్స్,యల్.పి.జి. వింగ్,శక్కర్‌నగర్, బోధన్, నిజామాబాద్ జిల్లా -